క్లుప్తంగా

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

అన్నపురెడ్డిపల్లి: టీబీ వ్యాధి లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అదనపు టీబీ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీ పరిధిలోని టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలను మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని టీబీ వ్యాధిగ్రస్తుడి ఇంటికి వెళ్లి మందులు వాడుతున్న తీరును పరిశీలించారు. టీబీ పాజిటీవ్ నమోదైన వారు క్రమంతప్పకుండా మందులు వాడాలని, ఇంటిలోని చిన్నలు, పెద్దలు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తన్మయి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, టీబీ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, హెచ్‌ఏ వాణి, పుష్ప, ఆశాలు స్వరూప, వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్ల డివిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం భద్రాచలం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఆర్డీఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డివిజన అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్ వేయాలని, బకాయి పడ్డా రెండు డీఆర్ వాయిదాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చల్లగుళ్ల నాగేశ్వరరావు, ప్రసాద్, సుబ్బయ్య, సత్యనారాయణ, రామ్మోహన్‌రావు, రాజబాబు, దాసు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన మట్టి రోడ్డు



దమ్మపేట బంజారాకాలనీలో కుంగిపోయిన మట్టి రోడ్డు

దమ్మపేట: వంతెనకు అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్డు, వర్షపు నీటి ప్రవాహానికి కుంగిపోయింది. గురువారం మండల కేంద్రంలోని బంజారా కాలనీ నుంచి ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న కాలవపై నిర్మించిన వంతెనకు అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్డు ఒక్కసారిగా కుంగిపోయింది. దీనితో వంతెనకు ఇరువైపులా నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షము ఇదేవిధంగా కొనసాగితే వంతెన కూడా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఈ వంతెన సామర్థ్యాన్ని పెంచాలని స్థానిక ఎమ్మెల్యేకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేసినప్పటికీ.. ఇప్పటివరకు పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో జీఎం(సివిల్) టి.సూర్యనారాయణకు గురువారం కొత్తగూడెంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ నాసర్‌పాషా, ఇఫ్టూ జిల్లా నాయకుడు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు ఆయా పనులను బట్టి స్కిల్ట్, హైస్కిల్డ్ వేతన కార్మికులుగా గుర్తించాలని కోరారు. రైలు మార్గం భద్రత విషయంలో దక్షిణ మధ్య రైల్వేకి అనుసంధానంగా వీరు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా విధులకు హాజరై రక్షణతో కూడిన రైలు ప్రయాణ మార్గానికి అంతరాయం లేకుండా సేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి వేతనాలు పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల వర్కర్స్ యూనియన్ నాయకులు మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

దమ్మపేట: ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గౌడ కులస్తులను ఎస్టీ కుల జాబితాలోకి చేర్చాలని కోరుతూ.. స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు ఆ సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. గురువారం మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను, గౌడ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న గౌడ కులస్తులు ఆర్థిక, సామాజిక రంగాల్లో పూర్తిగా వెనకబడిపోయారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గౌడ కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేర్చి, తద్వారా వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహారావు, బండి ప్రసాద్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, శ్రీమన్నారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకధాటి వర్షం.. అతలాకుతలం

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన
- రహదారులను ముంచెత్తుతున్న వరద
- జలకళను సంతరించుకున్న సాగునీటి వనరులు



అశ్వాపురం: అమ్మగారిపల్లి-ఆమెర్ల రహదారిపై గోదావరి వరద నీరు



చండ్రుగొండ: జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు



చర్ల: సత్యనారాయణపురం సమీపంలో వర్షాలకు నీటమునిగిన వరి నారుమళ్లు

చండ్రుగొండ: తుఫాను ప్రభావంతో మండలంలో రెండురోజులుగా వర్షం పడుతోంది. గురువారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా వర్షం పడుతూనే ఉంది. మధ్యాహ్నం కొంత మేరకు తెరపిచ్చినప్పటికీ సాయంత్రం మళ్లీ మొదలైంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో పంటలు కళకళలాడుతున్నాయి. మరోవైపు నీటి వనరుల్లో వర్షపునీరు చేరుతోంది.

నిలిచిన రాకపోకలు

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి–ఆమెర్ల రహదారిపైకి మధ్య గురువారం రాకపోకలు నిలిచిపోయాయి. అమ్మగారిపల్లి, ఆమెర్ల, చింతిర్యాలలో పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. చింతిర్యాల, ఆనందాపురం రహదారుల పైకి వరద నీరు చేరుతోంది.

నిండిన అంకమ్మ చెరువు

అశ్వారావుపేట: వర్షాల ధాటికి గురువారం సాయంత్రానికి అశ్వారావుపేట, ఊట్లపల్లి, కేశప్పగూడెం, గుర్రాలచెరువు గ్రామ పంచాయతీల నడుమ ఉన్న అంకమ్మ చెరువులో పూర్తిస్థాయికి నీరు చేరింది. శుక్రవారం అలుగు పడే అవకాశం ఉండటంతో ఆయకట్టు రైతులు, సమీప గ్రామస్తులు చెరువు జలకళను చూసేందుకు గురువారం ఆసక్తి చూపారు. ఈ చెరువు చెరువు కింద 1300 ఎకరాల ఆయకట్టు ఉంది. చేపల పెంపకానికీ పెట్టింది పేరు. వర్షాలు పడటంతోపాటు నీరు వచ్చి చేరుతుండటంతో ఆయకట్టు రైతులు నారుమళ్లు చేసేందుకు పొలాలను దుక్కి, దమ్ము చేస్తున్నారు.



అశ్వారావుపేట: నిండుకుండలా అంకమ్మ చెరువు

గోదావరి ఉగ్రరూపం

చర్ల: గోదావరికి భారీగా వరదనీరు వస్తుండడంతో ఉగ్రరూపం దాల్చుతోంది. గురువారం రాత్రి 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 43 అడుగులు దాటి 43.80 అడుగులకు చేరింది. దీంతో చర్ల మండలంలోని కొత్తపల్లి, పెద్దిపల్లి దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, సున్నంబట్టి, దుమ్ముగూడెం సమీప గ్రామాల్లో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో చర్ల మండంలోని కొత్తపల్లి–దండుపేట గ్రామాల మధ్యలోని ప్రధాన రహదారిపైకి వరదనీరు చేరి ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల వద్ద గోదావరి ఉధృతి



పర్ణశాలలోని సీతమ్మవారి నారచీరల ప్రాంతంలో వరద..



చర్ల మండలం కొత్తపల్లి సమీపంలోని గోదావరి లంకల్లోకి చేరిన వరద



దండుపేట-కొత్తపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపైకి చేరిన గోదావరి బ్యాక్‌వాటర్



అశ్వాపురం: కుమ్మరి గూడెంలో సీతమ్మసాగర్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద ప్రవాహం

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ముంపు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పలు కాలనీలు వర్షపు నీటితో ముంపుకు గురికావడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరినే కారణమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్ ఆరోపించారు. పట్టణంలో భారీ వర్షంతో ముంపుకు గురైన కాలనీలో గురువారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి పెరుగుతుండడంతో భద్రాద్రి పట్టణంలో పలు కాలనీలకు ముంపు ప్రమాదం ఉందని తెలిసిన ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ భద్రాద్రి అభివృద్ధికి ప్రకటించిన వేల కోట్లు నిధులు విడుదల చేయకపోవడమే ఈ దుస్థితికి కారణం అని అన్నారు. ఇప్పటికైనా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యేతో కలిసి భద్రాద్రి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బుడగం శ్రీనివాస్, చింతరాల రవికుమార్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ గౌడ్, సుబ్బారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగానే ఏటా రామాలయం పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఇకనైనా పెద్ద మోటార్లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి ఆర్డీవో రత్నకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు గడ్డం స్వామి, ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ.. వారం క్రితం సమీక్ష జరిపినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో తాజా వర్షాలకు భద్రాచలంలోని రామాలయం పరిసర ప్రాంతాలు, విస్తా షాపింగ్ కాంప్లెక్స్ ముంపునకు గురయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పెద్ద మోటార్ల ద్వారా నీరు తొలగించాలని డిమాండ్ చేశారు. నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, ఎస్.రామకృష్ణ, ధనకొండ రాఘవయ్య, శ్రీనివాస్‌తో పాటు ముంపు ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

నత్తనడకన పనులు



ఖమ్మం రోడ్డులో తవ్వి వదిలేసిన డివైడర్

అశ్వారావుపేట: అశ్వారావుపేట గ్రామంలో జాతీయ రహదారికి, పోలీస్‌స్టేషన్ నుంచి భద్రాచలం రోడ్డు అభివృద్ధి పనులు నత్తనడకన సాగడంతో స్థానికులను ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల క్రితం డివైడర్ నిర్మాణం కోసం రాళ్ల తోలి పనులను మొదలు పెట్టారు. ఇందుకోసం తెగ అట్టహాసం చేశారు. కానీ పనులు మొదలయినప్పటి నుంచి ఇక్కడ ప్రజల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. డివైడర్‌ను తవ్వేశారు. ఈ శకలాలను బయటకు తరలించకుండా అమ్మేసుకున్నారు. అదీ పూర్తిగాకాకుండా మధ్యలో ఆపేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై భారీ గుంతలు పడ్డాయి. కానీ వాటి ఊసే వదిలేశారు. ఇక భద్రాచలం రోడ్‌లో రహదారి విస్తరణ పేరుతో దుకాణాల ఎదుట అప్పర్‌బర్మ్ (మట్టి)ని తవ్వేశారు. దుకాణాలకు వినియోగదారులు చేరుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇక్కడా వర్షాల కారణంగా బురదగుంతలు దర్శనమిస్తున్నాయి. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లయింది స్థానికుల పరిస్థితి. పనులు వేగవంతంగా పూర్తి చేయకున్నా అసౌకర్యాలకు గురిచేయవద్దని కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

విస్తారంగా వర్షాలు కురవడం, గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో ఆయా మండలాల్లోని అధికారులు అప్రమత్తం అయ్యారు. ముంపునకు అవకాశం ఉన్న గ్రామాల్లో ఆయా మండలాల తహసీల్దార్లు, పోలీస్ అధికారులు పర్యటించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. పునరావాస కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పినపాక: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దుర్గాప్రసాద్



పినపాక: పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



అశ్వాపురం: రామచంద్రాపురంలో గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజు



చర్ల: దండపేటలో గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ భరణిబాబు

సాయిబాబా ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరుకు చెందిన బండారు క్రాంతి–వింధ్య దంపతులు కుటుంబ సమేతంగా సాయిబాబాకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. బండారు క్రాంతి కుటుంబం సహకారంతో ఆలయ కమిటీ వారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మెపై నిర్లక్ష్యం విడనాడాలి



అశ్వారావుపేట: తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జీపీ కార్మికులు



చర్ల: పనులు అడ్డుకున్న కార్మికులు



చర్ల: భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

భద్రాచలంఅర్బన్: గత 15 రోజులుగా సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణమని ప్రజాపంథా జిల్లా నాయకురాలు కెచ్చల కల్పన అన్నారు. ఈ మేరకు గురువారం గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె 15వ రోజు సమ్మెను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. పంచాయతీ కార్మికులు కనీస వేతనం కోసం పోరాడుతుంటే వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. వర్షాకాల నేపథ్యంలో కార్మికుల డిమాండ్లను అంగీకరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు, విశ్వనాథ్, సాయి, సీఐటీయూ జిల్లా నాయకులు, నాగరాజు, పి.సంతోష్, జి.లక్ష్మణ్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు కాపుల రవి, రాయల రాములు, చెన్నకేశవులు, వి.శ్రీనువాసు, వరరాజు, జక్కుల కృష్ణార్జునరావు, కాపుల లక్ష్మణ్, ప్రసాద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం

అశ్వారావుపేట: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు గురువారం అశ్వారావుపేట రింగ్‌సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. సమ్మె 15వ రోజుకు చేరిన సందర్భంగా ఈవిధంగా నిరసన వ్యక్తం చేశారు.

విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తే సహించం

చర్ల: పోటీ కార్మికులను పంచాయతీ పనులకు ఉపయోగించి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో సమ్మెలో ఉన్న కార్మికులకు బదులు వేరే వారిని తీసుకొచ్చి పనులు చేయిస్తుండడాన్ని సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ.. సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలుంటాయని వారు హెచ్చరించారు. నాయకులు విజయకుమార్, నర్సింహారావు, ప్రేమ్‌కుమార్, సంతోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం..

దుమ్ముగూడెం మండలంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని సందర్శించిన జేఏసీ నాయకులు.. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. కార్మికులందరినీ పర్మినంట్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. నాయకులు తోకల నరేష్, కారం పుల్లయ్య, కొమరం దామోదర్, శ్రీనివాసరావు, సాయన్న, సింహాద్రి, మర్మం చంద్రయ్య పాల్గొన్నారు.

నిరసనగా భిక్షాటన..

తమ సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ గురువారం చర్లలో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు. చర్లలోని ప్రధాన వీధుల్లో హోటళ్లు, కిరాణాదుకాణాలు, పాన్‌షాపులు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు తిరిగి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ భిక్షాటన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు కల్యాణ్ కుమార్, ప్రేమ్‌కుమార్, కృపాల్, సంతోషమ్మ పాల్గొన్నారు.

వీధివీధినా చెత్తకుప్పలు

- పంచాయతీ కార్మికుల సమ్మెతో కదలని వ్యర్థాలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- మరోపక్క గోదావరి వరదతో ఇక్కట్లు



భద్రాచలంఅర్బన్: పాత ఎల్‌ఐసీ రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు



అశ్వారావుపేట: బస్టాండ్ సెంటర్‌లో పేరుకుపోయిన చెత్త



భద్రాచలంఅర్బన్: కరకట్ట సమీపాన చెత్త

భద్రాచలంఅర్బన్/అశ్వారావుపేట: గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు సమ్మె బాట పట్టడంతో భద్రాచలంలో పారిశుద్ధ్య పనులు పడకేశాయి. ఈ నెల 6 నుంచి వారు సమ్మె చేస్తుండగా పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చెత్త సేకరణ జరగకపోవడంతో రోడ్ల వెంట కుప్పలుగా పేరుకుపోతుండగా.. మరో పక్క గోదావరి వరద, వరుస వర్షాలతో పరిస్థితి ఇంకా దయనీయంగా మారింది. అధికారులు వెంటనే స్పందించకపోతే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

'తాత్కాలిక'ంగానూ పనులు సాగక..

గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగా, భద్రాచలం గ్రామపంచాయతీ అధికారులు తాత్కాలిక సిబ్బందితో పనులు చేయించాలని నిర్ణయించారు. అయితే, వీరిని పాత కార్మికులు అడ్డుకుంటుండడంతో పనులు సాగడంలేదు. ఫలితంగా పలు కాలనీల్లోని డ్రెయినేజీలు చెత్త తొలగించకపోవడంతో మురుగు నీరు పేరుకుపోతోంది. అలాగే, డ్రెయినేజీల వెంట, డస్ట్‌బిన్ల వెంట కుప్పలుగా చెత్తాచెదారం పేరుకుపోయింది. కనీసం డ్రెయినేజీల్లో బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ మందులను కూడా పిచికారీ చేసే పరిస్థితి లేదు.

పొంచి ఉన్న వ్యాధులు

అసలే వర్షాకాలం, ఆపై పారిశుద్ధ్య లోపంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో రహదారుల వెంట చెత్తాచెదారం, డ్రెయినేజీల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ ప్రాంతాలు దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయి. ఇంతలోనే వర్షాలు మొదలుకావడంతో సమస్య మరింత తీవ్రమైంది. పెరుగుతున్న దోమలతోపాటు వాతావరణ మార్పుతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అశ్వారావుపేట మండలంలో..

గ్రామపంచాయతీ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని 15 రోజులుగా సమ్మెలో ఉన్నారు. మరోవైపు మండల వ్యాప్తంగా జోరుగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిత్యం పేరుకుపోతున్న వ్యర్థాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. జులై నెలారంభం నుంచి జ్వరపీడితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అశ్వారావుపేట సీహెచ్‌సీలో ప్రస్తుత జ్వరపీడితుల సగటు సంఖ్య 30కి చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మె ఇలానే కొనసాగితే.. ఆ ప్రభావం సాధారణ ప్రజల ఆరోగ్యంపై పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో గ్రామపంచాయతీలు ఎంత శ్రమించినా ఈ సీజన్‌లో వ్యాధుల ప్రాభల్యాన్ని అదుపు చేయలేము. మలేరియా, డెంగీ, వైరల్, టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతూనే ఉంటారు. ఈ సారి అదనంగా పారిశుద్ధ్య సమస్య వాధుల ప్రాభల్యాన్ని పెంచే అవకాశం ఉంది. మరోపక్క గోదావరి ప్రవాహం ఉగ్రరూపం దాల్చుతుండగా.. ఏజెన్సీ గ్రామాలు నీటమునిగితే సమస్య మరింత జఠిలమవుతుంది. ఈ తరుణంలో గ్రామపంచాయతీ కార్మికుల సేవలు అత్యవసరం. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుకు రావాలి. పారిశుద్ధ్య పనుల్లోకి కార్మికులు చేరేలా చర్యలు జరపాలి.